నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 13 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## ధరణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ఆర్డీవోతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జూలై 12 : ధరణితో పాటు వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజలు ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల ఆర్డీవో రాములును మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్‌లో వివిధ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్ర స్థాయిలో విచారించి పరిష్కరించాలని తెలిపారు. రెవెన్యూ డివిజనల్ పరిధిలోని సమస్యలతో పాటు కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

చింతలమానేపల్లి, (కౌటాల) జూలై 12 : కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి లో శుక్రవారం 'పోలీసులు మీ కోసం' కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్‌లోని షణ్ముఖ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు హాజరయ్యారు. వృద్ధులకు 200 దుప్పట్లు, యువకులకు 5 వాలీబాల్ కిట్లు, 30 మందికి హెల్మెట్లు, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంఘ విద్రోహక శక్తులకు సహకరించవద్దని, ప్రలోభాలకు లోంగి మోసపోయి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాధిక్ పాషా, ఎస్ఐలు మధుకర్, నరేశ్, షణ్ముఖ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినిని పాఠం చదివిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

## సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

లక్షెట్టిపేట, జూలై 12: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, మెరుగైన విద్య అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ ఉపాధ్యాయులు, అధికారులను ఆదేశించారు. లక్షెట్టిపేట మండలంలోని పోతపల్లి, లక్ష్మీపూర్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అమ్మా ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నదన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, బుక్స్‌తో పాటు అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న వసతులపై ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని, బడీడు, బడి మానేసిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పాఠ్యాంశాలకు సంబంధించి ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. అంతకు ముందు లక్షెట్టిపేట తహసీల్ కార్యాలయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని, మందులు అందుబాటులో ఉంచాలని, సమయ పాలన పాటించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట ఎంపీడీవో సరోజ, తహసీల్దార్ రాఘవేంద్రరావు, దవాఖాన సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్, వైద్యులు సురేశ్, రవళి, రమ్య, ఎంపీవో అజ్మత్ అలీ, ఈజీఎస్ ఏపీవో వెంకటరమణ, పాఠశాలల ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.

# సొమ్మొకరిది.. సోకొకరిది

● బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పనులకే ఎంపీ, ఎమ్మెల్యేల ప్రారంభోత్సవాలు ● పెదవి విరుస్తున్న చెన్నూర్ నియోజకవర్గ ప్రజలు

చెన్నూర్ పట్టణంలో 2023 జూన్ 5న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, అధికారులు(ఫైల్)

BALKA SUMAN, M.L.A
GOVERNMENT WHIP
62-Chennur Constituency
Telangana State

(D) Quarter No. 25, Ministers Quarters
Road No. 12, Banjara Hills, Hyderabad
Phone: 040 - 23317888
(R) Near Old R&B Guest House
I.B. Chowrasta, Chennur, Dist. Mancherial
Mob: 9491088888

R.O.I.e.No.Rem. Whip/185/2021, dated 21.06.2021

Sir,

Sub:- MGA Assembly Constituency – Chennur – Mancherial District – Construction of Third BC Line between Bellampalli - Mandamarri on Kazipet - Balarsha Section – Construction of 2 Lane ROB at the existing Bridge No. 165-A (Civil Bell Road) On Banjara - Mandamarri Road (NDR) at Km 18/0-150 in Mancherial District – Regarding Structures fall in the alignment of R.O.B – Request for change of the alignment to avoid the structures – Reg.

Ref:- Representation from the people of Mandamarri town

Sir,

It is to bring to your kind notice that the work "Construction of Third BC line between Bellampalli - Mandamarri in Kazipet - Balarsha Section - Construction of 2 Lane ROB at the existing Bridge No. 165-A (Civil Bell Road) On Banjara - Mandamarri Road (NDR) at Km 18/0-150 in Mancherial District" is sanctioned adjacent (Right side) to the existing old Bridge. During my recent visit to the Mandamarri town, the people are expressing that the sanctioned R.O.B approaches passes through the town limits of Mandamarri town and many civil assay structures are falling in the alignment. The People of Mandamarri town are requesting for change in the alignment of the R.O.B approaches for avoiding the huge loss due to acquisition of assets for the construction of new R.O.B approaches. The People are frequently approaching me for the change in alignment of the R.O.B approaches.

In this regard, I request the Chief Engineer (R&B), Admin, Q.C., LWE, D&P & NBW to kindly consider the request of minor change in alignment of the R.O.B approaches part so as to avoid the inconvenience for the people of my constituency.

With best regards,

Yours Sincerely,

(BALKA SUMAN)

To
The Chief Engineer (R&B),
Admin, Q.C., LWE, D&P & NBW,
Errammanzil, Hyderabad.

మందమర్రిలోని రామన్ కాలనీలో ఆర్‌వోబీ అలైన్‌మెంట్ మార్పు కోసం ఆర్‌అండ్‌బీ సీఈకి రాసిన లేఖ

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నిధులు మంజూరు చేయడంతో చెన్నూర్‌లో పూర్తయిన సబ్‌స్టేషన్

మంచిర్యాల, జూలై 12(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలో 'సొమ్మొకరిది.. సోకొకరిది..' అన్న చందంగా ఉంది. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో నిధులు మంజూరై పూర్తయిన పనులకు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌లు మళ్లీ ప్రారంభోత్సవాలు చేస్తుండడంపై నియోజకవర్గ ప్రజలు పెదవి విరుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ హైదరాబాద్‌కు పరిమితమవుతూ నియోజకవర్గ అభివృద్ధికి ఏ మాత్రం నిధులు కేటాయించేలా కృషి చేయకపోవడం విమర్శలకు తావిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో మంజూరైన పనులు నేడు పూర్తికాగా ఆ పనుల ప్రారంభోత్సవాలను తండ్రీకొడుకులైన ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణలు వస్తుండడం చూసి నియోజకవర్గ ప్రజలు నవ్వుకుంటున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయికి కూడా తీసుకురాకుండా బాల్క సుమన్ కృషితో మంజూరైన అభివృద్ధి పనులను మేమే చేశామని చెప్పుకుంటుండడం విడ్డూరంగా ఉందని పేర్కొంటున్నారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తన ఐదేళ్ల పాలనలో నియోజకవర్గంలో 22 బ్రిడ్జిలు మంజూరు చేసి నియోజకవర్గ ప్రజలకు రవాణా కష్టాలు లేకుండా చేశాడు. చెన్నూర్ నియోజవర్గ ప్రజలు చెన్నూర్–బీమారం మధ్యగల జోడువాగుల రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతుంటే కంకర పోసి చేతులు దులుపుకొని బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు మరమ్మతులపై దృష్టి ఎందుకు సారించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అన్ని మేమే చేసుకుంటున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలుగా చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి తీసుకొచ్చిన నిధులెన్ని, ప్రారంభించిన పనులెన్ని అని ప్రశ్నిస్తున్నారు. గతంలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కృషితో మందమర్రి రామన్ కాలనీలో ఆర్‌వోబీ నిర్మాణానికి రూ.27.05 కోట్లు మంజూరు చేయించి పనులను పూర్తి చేయించాడు. ప్రజల విజ్ఞప్తి మేరకు అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ అప్పటి ఆర్ అండ్‌బీ సీఈ సతీశ్‌తో మాట్లాడి ఆర్‌వోబీ అలైన్‌మెంట్ మార్చడం వల్ల సుమారుగా 90 ఇండ్లు నేలమట్టం కాకుండా కాపాడగలిగారు. చెన్నూర్ ప్రజల అవసరాల కోసం చెన్నూర్ పట్టణంలో 2023 జూన్ 5న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు రూ.1.90 కోట్లు మంజూరు చేయగా.. ఆ పనులు పూర్తి కావడంతో చెన్నూర్‌లో విద్యుత్ సమస్యకు దాదాపుగా పులిస్టాప్ పడింది. బాల్క సుమన్ ముందుచూపుతో చెన్నూర్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండాలని సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులను త్వరితగతిన పూర్తి చేయించాడు. చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు పాలన పరంగా ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గంలో 37 గ్రామ పంచాయతీలకు భవన నిర్మాణాలు మంజూరు చేయించారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పుల నిధులు కూడా మంజూరు చేయించగా, ఆ నిధులతో పూర్తయిన కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామ పంచాయతీ భవనాన్ని తండ్రీకొడుకులు ప్రారంభించారు.

## పాత తలుపులకు రూ.30 వేలు వసూలు !

**వాటికి వాడిన కలప అక్రమమని బెదిరింపులు**

● ఎడ్లను అమ్మి అటవీ అధికారులకు డబ్బులు కట్టిన ఆదివాసులు ● న్యాయం చేయాలని డీఎఫ్‌వోకు ఫిర్యాదు

డీఎఫ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ ఐకాస నాయకుడు కనక యాదవ్‌రావ్, బాధితులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): అటవీ భూములను ఆక్రమించి పోడు వ్యవసాయం చేస్తున్నారనో..అడవిలోని చెట్లను నరుకుతున్నారనో కలప రవాణా చేస్తున్నారనో.. ఇలా ఏదో ఒకరకంగా ఆదివాసీలపై అటవీ అధికారులు నిత్యం వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా లింగాపూర్ మండలం లెండిగూడాకు చెందిన ఆదివాసీ ఇళ్లలో తనిఖీ చేసి ఇంటి తలుపులు వాడిన కలప అక్రమమని బెదిరించి అటవీ అధికారులు తమ వద్ద రూ.30 వేలు వసూలు చేశారని ఆదివాసీలు డీఎఫ్‌వోకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో లింగాపూర్ మండలం లెండిగూడ గ్రామానికి చెందిన మడావి రాము, మరప సాగర్ పదేళ్లకు ముందే నిర్మించిన ఇండ్లల్లో ఉంటున్నారు. ఈ నెల 4న ఆ ప్రాంతంలో అటవీ శాఖ ఎఫ్ఎస్‌వో రాందాస్, ఎఫ్‌బీవో వనిత వారి ఇళ్లలో కలప ఉందని తనిఖీలు చేశారు. అయితే కలప దొరకకపోయేసరికి వారి ఇంటికి ఉన్న తలుపులను చూసి ఇవి పాతవి కాదని, కొత్తగా ఏర్పాటు చేశారని, అందుకు వాడిన కలపను అటవీ నుంచి అక్రమంగా తీసుకువచ్చారని, జరిమానా విధించి కేసులు పెడుతామని బెదిరించారని ఆదివాసులు తెలిపారు. రూ.30 వేలు ఇస్తే కేసులు లేకుండా వదిలేస్తామని చెప్పడంతో చేసేదేమీలేక ఎద్దులను అమ్మి అటవీ అధికారులకు ముడుపులు ముట్టజెప్పినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఆదివాసీ సంఘాల ఐక్యకార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కనక యాదవ్‌రావ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా డీఎఫ్‌వో అందుబాటులో లేకపోవడంతో అటవీ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌కు ఆదివాసులు ఫిర్యాదు చేశారు. జిల్లాలో పోడు వ్యవసాయం చేస్తున్నారనే నెపంతో ఆదివాసీలపై ఆరోపణలు చేస్తూ జీవనాధారమైన భూములకు ఆక్రమించుకునేందుకు, ఏదో ఒక సాకు కేసులు పెట్టేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఎఫ్ఎస్‌వో రాందాస్‌ను వివరణ కోరగా ఏ తనిఖీలు చేయలేదని, డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

### ఎద్దులను అమ్మి 30 వేలు ఇచ్చిన ..

మా గ్రామంలో అటవీ అధికారులు నా ఇంటితోపాటు మపర సాగర్ ఇంటిలో కలప ఉందని తనిఖీలు చేశారు. కలప దొరకకపోయే సరికి మా ఇండ్లకు ఉన్న పాత తలుపులపై కేసు నమోదు చేస్తామని బెదిరించారు. రూ.30 వేలు ఇస్తే కేసులు నమోదు చేయకుండా వదిలేస్తామని అన్నారు. దీంతో మేము భయపడిపోయాం. మాకు ఉన్న ఎడ్లని అమ్మి అటవీ అధికారులకు రూ.30 వేలు కట్టినం. ఇప్పటికే పోడు భూముల్లో వ్యవసాయం చేస్తున్నామని కేసులు పెడుతున్నరు. కేసుల భయంతోనే డబ్బులు కట్టినం.

**- మడావి రాము, లెండిగూడా, లింగాపూర్ మండలం**

### మాకు న్యాయం చేయాలి..

మా ఇళ్లలో చొరబడి మా ఇండ్లకు ఉన్న పాత తలుపులను కొత్తవిగా చూపించి మాపై కేసులు పెడుతామని బెదిరించి మా వద్ద రూ.30 వేలు తీసుకున్న ఎఫ్ఎస్‌వో రాందాస్, ఎఫ్‌బీవో అనితపై చర్యలు తీసుకోవాలి. మా డబ్బులు ఇప్పించాలి. వ్యవసాయ పనులను అడ్డుకొని అటవీ అధికారులు అక్రమంగా కేసులు పెడుతారమోనని భయపడి మా ఎడ్లను అమ్మి వారికి డబ్బులు కట్టినం. ఇటు ఎడ్లు లేక, చేతిలో డబ్బులు పోయి ఇబ్బందులు పడుతున్నం.

**- మపర సాగర్, లెండిగూడా, లింగాపూర్ మండలం**

## వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

● పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలి ● కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, జూలై 12: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కాగజ్‌నగర్ మున్సిపల్ అధికారులు, సిబ్బందిని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. కాగజ్‌నగర్ పట్టణంలో నిర్వహించిన ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. పలు వార్డుల్లో పర్యటించి దోమల నివారణపై పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లోని పూల కుండీల్లో నీళ్లు, కుండలు, టైర్లలో ఉన్నా వృథా నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ప్రతి శుక్రవారం ఫ్రైడే– డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, దోమల నివారణకు, లార్వా ఆవాసమైన మురుగు నీటిని తొలగించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆర్డీవో సురేశ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మున్సిపల్ సిబ్బంది క్రాంతి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### భట్టుపల్లి ప్రభుత్వ దవాఖాన తనిఖీ..

కాగజ్ మండలంలోని భట్టుపల్లి ప్రభుత్వ దవాఖానను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేతో పాటు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తనిఖీ చేశారు. దవాఖానలోని వార్డులు, ఫార్మసీ, రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. విష జ్వరాలు, అంటు వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వివరాలు తెలుసుకోవాలని ఆదేశించారు.

### నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నిషేధిత ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే హెచ్చరించారు. కాగజ్‌నగర్‌లోని ఎరువులు దుకాణాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డు రిజిష్టర్లు, ఎరువుల, విత్తనాల నిల్వలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఏవో రామకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

## రూ.10 కోట్లకు కుచ్చుటోపీ !

● అప్పులు చేసి స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు
● నష్టాలతో తీర్చలేక జ్యువెల్లరీ వ్యాపారి ఉడాయింపు
● లబోదిబోమంటున్న బాధితులు

తాళం వేసి ఉన్న దుకాణం

మంచిర్యాల అర్బన్, జూలై 12: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో ఉన్న ప్రముఖ జ్యువెల్లరీ యజమానులు పట్టణ వాసుల నుంచి సుమారు రూ.10 నుంచి 12కోట్ల వరకు అప్పులు తీసుకొని ఎగ్గొట్టి రాత్రికి రాత్రి కుటుంబంతో ఉడాయించిన ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని మార్కెట్‌రోడ్డులో ఉన్న తుకారాం జ్యువెల్లర్స్‌ను నాందేవ్, అతని కుమారుడు అమర్ నిర్వహిస్తున్నారు. పట్టణవాసుల నుంచి కోట్లాది రూపాయలు అప్పులు తీసుకొని స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు. మొదట్లో బాగానే కలిసివచ్చినా ఆ తర్వాత నష్టాల్లో కూరుకపోయారు. వీరికి అప్పులు ఇచ్చిన వారు తిరిగి డబ్బులను చెల్లించాలని ఒత్తిడి చేస్తుండగా ఏడాదిగా వారు పొంతనలేని సమాధానాలు చెబుతూ వచ్చారు. బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా ఉడాయించారు. విషయం తెలుసుకున్న బాధితులు మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ వారి వద్దకు వెళ్లి సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయంపై బులియన్ మర్చంట్ అధ్యక్షుడు సింహరాజు శ్రీనివాస్‌ను వివరణ కోరగా విషయం వాస్తవమేనని, బాధితులు వచ్చి అప్పులు ఇచ్చిన వివరాలు చెప్పారని తెలిపారు. బాధితుల పక్షాన పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా ఇంతవరకూ ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

● పార్టీకి పూర్వ వైభవం తేవాలి
● రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జూలై 12: బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, పార్టీకి పూర్వ వైభవం తేవాలని నాయకులు, కార్యకర్తలకు పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాజకీయ పదవులు అనుభవించి, అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఉద్యమ ద్రోహి అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ ఫలాలను అనుభవించిన నాయకులు పార్టీకి వెన్ను పోటు పొడిచి కాంగ్రెస్ నాయకుల పంచన చేరడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి ద్రోహులను పట్టించుకోవద్దన్నారు. 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సి ఉండగా 2014 వరకు ఆలస్యం చేసి, వందలాది మంది విద్యార్థుల చావుకు కాంగ్రెస్ పార్టీ కారణమైందని ఆరోపించారు. తెలంగాణ వ్యతిరేక వాదులు కొందరు నాయకులు సిర్పూర్ ప్రాంతంలో యథేచ్ఛగా దోపిడీ చేయడానికే కాంగ్రెస్ పార్టీలో చేరారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ విద్యావతి. నాయకులు రాజ్‌కుమార్, శ్యాంరావు, శంకర్, ఆవుల రాజ్‌కుమార్, కౌన్సిలర్ మిన్‌హాజ్, తదితరులు పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679